# నాతోటి ప్రయాణీకుడు

బుద్ధిరాజు రాజభూషణరావు గారు, బి. ఏ., బి. యల్.

మాయిద్దర్లో రైలుపెట్టెలో ముం దెవరు ప్రవేశించారో నాకు తెలియదు. అసలు ఇంకొక రా పెట్టెలో ఉన్నారనే అనుకోలేదు కొంతసేపటిదాకాను. రైలుబండి రహదారీపడవలాగా ఎక్కడపడితే అక్కడే ఆగుతూ, శాశ్వతత్వమంటే యేమిటో మనస్సుకు గోచరించేటట్లు సావకాశంగా పాక్కుంటో పోతోంది. మొదట బయల్దేరినప్పు డేమో రైలు కొంతవరకు నిండుగానే ఉంది. కాని ఆగినస్టేషను దగ్గిరల్లా ఒకరొకరు, ఇద్దరిద్దరు చొప్పున దిగిపోవడం ఆరంభించారు. ఇలా నాలుగైదుస్టేషన్లు దాటేటప్పటికి నా పెట్టెలోనే నొక్కడ్నే మిగిలిపోయాను; కాదు కాదు, ఒక్కడ్నే మిగిలిపోయా ననుకున్నాను.

రాత్రివేళ కొద్దిగా రొదచేస్తూ కుదుపుకుంటూ పోతున్న రైలుపెట్టెలో ఒకడూ ఉండటంలో ఒక విధమైన ఆనందం ఉంది. ఎక్కడాలేని స్వేచ్ఛా స్వతంత్రమూ వస్తాయి మనకి. ఏంతోస్తే అది చెయ్యొచ్చు. ఎంత గట్టిగా మాట్లాడుకోవాలంటే అంత గట్టిగా మాట్లాడుకోవచ్చు; వినేవా డెవడూ వుండడు. ప్రతిపక్షులతో అమాంతంగా వాదంచేసి పట్టీలు కొట్టించొచ్చు; ఎదురు చెప్పే మొనగా డెవడూ వుండడు. నెత్తికిందకీ, కాళ్లమీదికీ పెట్టె తల్లకిందుగా జపంచేసినా చూసేవా డెవ్వడూ వుండడు పాడొచ్చు, ఆడొచ్చు, బంతాట అభ్యాసం చెయ్యొచ్చు. అడ్డులేకుండా గోళీకాయ లాడుకోవచ్చు. కిటికీతలుపులు వేసినా తీసినా అడిగేవా డెవడూ వుండడు. రెండు తలుపులూ తెరుచుకున్నా సరే, మూసుకున్నా సరే. లేకపోతే అదేపనిగా వేస్తోతీస్తో ఆడుకుంటూ కూర్చున్నా పరవాలేదు. పెట్టెలో ఏమూలపడితే ఆమూలే కూచుంటూ, ఒకచోట్నించి ఇంకోచోటికి తిరుగుతో, కూచుంటో లేస్తో, కాలం గడపొచ్చు. నిలువుగా బల్లమీది మెత్తలపైని నిగడదన్నుకు పడుకోవచ్చు.

అయితే, నేనీరాత్రి వీటిలో ఏపని చెయ్యలేదు. అవేవైనా చెయ్యాలని తోచలేదు. నేను చేసిందంతకంటె చాలా సర్వసాధారణమైన పని. నాపెట్టెలోంచి ఆఖరుప్రయాణీకుడుకూడా దిగి వెళ్లిపోయిం తరువాత, ఒక్కసారి నేను చదువుతున్న పేపరు కింద పెట్టాను. కాళ్లు చేతులు ఒకసారి చాపుకొని వొళ్లు విరుచుకొని, నాపెట్టెలోంచి ఆ ప్రశాంతమైన రాత్రివేళ కిటికీగుండా ఒకసారి బైటికి చూశాను. ఉత్తరపువైపు ఆకాశం కొంచెం వెలవెలలాడుతూ గడచిపోయిన పగటి నింకా జ్ఞాపకం చేస్తోనేవుంది. ఆ కిటికీదగ్గర్నించి కదిలి రెండోవైపు కిటికీలోంచి చూశాను. తరవాత సిగరెట్టొక టంటించి కూర్చుని తిరిగీ పేపరు చదువుకోవడం ప్రారంభించాను. పెట్టెలో ఇంకెవరో వున్నట్టు నాకప్పుడు తెలిసింది. వచ్చి ముక్కుమీద కూచున్నదాకా ఎవరో వున్నట్టు నాకు తెలిసిందే కాదు......రెక్కలుండి సన్నని కూనురాగం తీస్తో, నిర్భయంగా తిరుగుతో మనం సామాన్యంగా దోమలంటామే ఆపురుగుల్లో వొకటి ఆ వచ్చి వాలింది. వెంటనే దాన్ని నా ముక్కుమీంచి దులిపేశాను. ఆపెట్టె అంతా కిందనించి పైకి, పైనించి కిందకీ పరీక్షచేసి చూచింది. ఆమూల కూచున్న పెద్ద జంతువుకంటె తమాషా అయిన పదార్థం ఇంకోటిలేదని నిశ్చయించుకుని దగ్గిరకొచ్చి నాకంఠంకేసి పరకాయించి చూసింది. మళ్లీ నేను దాన్ని విదిపేశాను. అది తప్పించుకుని పెట్టెలో ఒకసారి సంచారంచేసి మళ్లీ వెనక్కొచ్చి సాహసంగా నా చేతిమీద వాలింది. నా కంతట్లో చజ్జుమంది. ఇక చాలు నీ అల్లరన్నాను. 'మంచితనానికి గూడ మితముంది. నేను సామాన్యుడ్ని కానని నీ కప్పుడే రెండుమాట్లయింది చెప్పి. కొత్తవాళ్లొచ్చి నాదగ్గిర అవిధేయతగా ప్రవర్తిస్తే నా కోపమొస్తుంది. నీ కింక మరణదండన విధిస్తున్నాను. నువ్వుచేసిన నేరాలు చాలా వున్నాయి. నీవు దేశదిమ్మరివి. నీవల్ల ప్రజలకు చాలా చిరాకుగాను, బాధగాను ఉంటుంది. పైగా టిక్కెట్టు

లేకుండా ప్రయాణంచేస్తున్నావు. ఇవ్వే కాకుండా నువ్వు చేసేతప్పు లింకా వున్నాయి వీటన్నిటికి ప్రతిఫలంగా నువ్వు చావటానికి సిదంగా వున్నావు' అంటూ తొందరగా నేను కుడిచేత్తో వొక్క పెద్దదెబ్బ కొట్టాను. అది అతి లాఘవంగా తప్పించుకుని నన్ను పరాభవం చేసింది. నాలోవున్న దురభిమానం పైకి పొంగింది. చేత్తో వొకమాటూ, పేపరుతో వొకమాటూ దాన్ని కొట్టబోయాను. అమాంతంగా బల్లమీది కురికి దాన్ని దీపంచుట్టూ తరిమాను పిల్లిలాగ పొంచుంటూ, అదెక్కడైనా ఆగిందాకా ఆగుతూ, అడుగులో అడుగేసుకుంటూ, మెల్లిగా దాన్ని సమీపిస్తూ, గభీమని దాన్ని ఒక పెద్దదెబ్బకొట్టబోతూ నాచాకచక్యమంతా చూపించాను.

నాప్రయాసంతా వృథా అయిపోయింది. అది నాతో బహిరంగంగా నిర్లక్ష్యంగా ఆడుకోటం ప్రారంభించింది. ఈవిధంగా అది ఆనందిస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోనేవుంది. ఆ వినోదంకోసమే నా శాంతానికది భంగం కలిగించింది. దానికి కొంచెం ఖులాసా కావలిసొచ్చింది. చాలా రుచిగా వున్నాడన్నమాటే కాని, వట్టి చేతకానివాడు బుద్ధిలేనివాడు లాగా వున్నాడే, వీడు పెద్ద కళేబర మేసుకుని ఈదుకుంటూ రోజుకుంటూ నావెనక పరుగెత్తుకుంటూరావడంకంటె వినోదమేమిటుం దనుకుంది కాబోల్ను. అప్పుడు దాని మనస్తత్వంలో ప్రవేశించడానికి ప్రయత్నించాను. ఇక నా కది ఉత్తపురుగులా కనిపించలేదు. ఈపెట్టె నీదా నాదా అని నాతో సమానంగా హోరాహోరీని డీకొట్టానికి చాలిన తెలివితేటలుకల ఒక వ్యక్తిగా మారిపోయిందది. దానియందు నాకు ప్రేమ అంకురిస్తున్నట్టు తోచింది. దానికంటె నే నెక్కువవాణ్నే అహంభావ మడుగంటింది. మే మిద్దరం వేసుకున్న యీవొక్క పందెంలోనూ నేనోడిపోయాక ఇంకా నాయెక్కువేమిటి అర్థాన్నము. అటువంటప్పుడు నాకు ఔదార్య మెందు కుండకూడదు? ఔదార్యమూ, దయా అనే యీరెండున్నూ మనిషి కుండవలసిన గొప్ప లక్షణాలు. ఈ రెండు లక్షణాలు చూపించితేనే నామర్యాద నాకు దక్కుతుంది. ప్రస్తుతం నే నందరూ వుడికించటానికీ, ఏడిపించటానికి వీలైన నిర్భాగ్యుడైపోయాను. నే నిక దయ చూపించినట్టయితే మళ్లీ నాగౌరవం నేను సంపాదించుకోవచ్చు. మరణదండన రద్దుచేసి యథాప్రకారం నామూలను నేను పోయి గంభీరంగా కూచున్నాను. నేను నిన్ను చంపలేను కాని నీకు కొంచెము బుద్ధి చెప్పవలసి వుంటుందన్నాను.

మళ్లీ నేను పేపరు తీశాను చదవడానికి. అదివచ్చి వెంటనే పేపరుమీద వాలింది... నీవు వట్టిమూర్ఖుల్లా కనిపిస్తున్నావు. ఇప్పుడు నువ్వు పూర్తిగా నా చేతుల్లో చిక్కావు ఈపేపరు నేను రెండువైపులా చరచినట్టయితే రెండు కాకితాల సందునీపడి నలిగి చచ్చిపోతావు. నిన్నిందుకోస మిప్పుడే చివాట్లేశాను కాని నేను నిన్ను చంపను. ఈ పెద్దజంతువు అన్నమాట తప్పదన్నసంగతి నువ్వు తెలుసుకోవాలి. అంతేకాకుండా నిన్ను చంపటం నా కిష్టంకూడా లేదు. నిన్ను బాగా అర్థంచేసుకున్నకొద్దీ, నీయందు నాకు ప్రేమ ఎక్కువౌతోంది. నీయందు నేను పూర్తిగా సోదరభావం చూపించలేకపోయినా ఒకమోస్తరు దూరపు బంధుత్వం మనిద్దరికీ వుందన్న సంగతి తెలుసుకున్నాను. ఈరాత్రి మనిద్దరం విధివశాత్తు కలిసి ప్రయాణంచేయడం తటస్థించింది. నీకు నేను వినోదం కలిగించాను. నన్ను నువ్వు సంతోషపెట్టావు. ఇలా మనిద్దరం ఒకరికొకరం పరస్పరం ఋణపడివున్నాము. మనిద్దర్లో వున్న జీవితరహస్యమూ, సృష్టివైచిత్ర్యమూ వొకటే. మనిద్దరికీ మర్త్యత్వం సమానమే. నీకు నీప్రయాణం సంగతేమీ తెలియదనుకుంటాను. అల్లాగే నా ప్రయాణంసంగతి నాకూ సరిగ్గా తెలుసునని రూఢిగా చెప్పలేను. నువ్వు ఆలోచించిచూసుకోగలిగితే మనిద్దరికి పోలికలు చాలా వున్నాయని తెలుస్తుంది. మనిద్దరంకూడా కాసేపు కనపడి తరువాతిక్షణంలో మాయమైపోయే దృశ్యాలము. బయటిచీకట్లోంచి వెల్తురున్న బండిలోకివచ్చి దీపం చుట్టూ కొంచెంసేపు రెపరెపలాడుతూ తిరిగి, మరుసటి నిమిషంలో మళ్లీ అంధకారంలోకి పోతాము......

కిటికీదగ్గిరికొచ్చి "అయ్యా, యింకా పైకి వెడుతున్నారా?" అని యెవరో నన్నడిగినట్టు వినపడ్డది. నేను దిగవలసిన స్టేషను వచ్చిందని నాకు జ్ఞాపకంచేసి పుణ్యం కట్టుకోటానికొచ్చిన పోర్టరు నన్నల్లా పలకరించాడు. అతన్ని నేను మెచ్చుకొని 'మత్తుగా పడున్నాను కాబోల్నిప్పటిదాకా' నన్నాతన్తో. చేతికఱ్ఱా టోపీతీసుకుని బయటి చల్లగాలిలో కాలుపెట్టాను. పెట్టె తలుపు లేస్తు బయట్నుంచి లోపలికి చూశాను. ఇంకా నాతోటి ప్రయాణీకుడు దీపంచుట్టూ తిరుగుతున్నట్టే కనిపించింది.